మానవ జీవితం ఒక యాత్రాస్మృతి అంటారు. దాశరథి తన జీవితానుభవాలకు పెట్టుకున్న పేరు అదే. ఆ 'యాత్రాస్మృతి'లో ఆయన ఎన్నో తీపి, చేదు అనుభవాలను పంచుకున్నారు. మహామహులతో స్నేహం చేసిన దాశరథి.. సామాన్యులతోనూ స్నేహశీలిగా మెలిగిన నిగర్వి. మృత్యువుకు భయపడని సాహసి. ఇవే దాశరథి సాహితీ కీర్తి కిరీటంలోని కలికితురాయిలు. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యంలో ఆయన ప్రయాణాలు ఎంతో అద్భుతమైనవి. ఆ అనుభవాలు ఇప్పటితరానికీ స్ఫూర్తినిచ్చేవి. ఆ కవి హృదయం చదివి చలించండి.

# చావు పెండ్లి!






**1947 డిసెంబరు మాసం**

రాత్రి పదిగంటలు

వరంగల్లు జైలులో ఉన్న దాశరథిని, మరి కొంతమంది ఖైదీలను బట్టలు సర్దుకోవాలని జైలు అధికారులు ఆదేశించారు. అంతకు ముందు వట్టికోట ఆళ్వారుస్వామి, కాళోజీతో పాటు మరికొందరిని ఇలాగే సర్దుకోమని చెప్పి వరంగల్లు జైలు నుంచి బయటకు తీసుకుపోయారు. వాళ్లను ఎక్కడికి తీసుకుపోయారో? ఏమి చేశారో ఖైదీలకు తెలియదు. ఇప్పుడు వీళ్ల వంతు వచ్చింది. ఖైదీలు పెట్టేబేడా సర్దుకున్నారు.

ఖైదీలను ఒక జైలు నుంచి మరో జైలుకు మార్చడం నిజాం నిరంకుశ పాలనలో ఓ విధానంగా ఉండేది. అందువల్ల ఆనాడు దాశరథితో పాటు మరెందరో స్వాతంత్ర్య సమరయోధులు, నిజాం వ్యతిరేకులను తరచుగా జైళ్లు మారుస్తూ హింసించేవాళ్లు.

ముప్పై మంది ఖైదీలు పెట్టేబేడా సర్దుకున్నారు. కొంతమంది మాత్రం తమను విడుదల చేస్తారని ఆశతో ఉన్నారు. చివరికి జైలు బయట వాళ్ల కోసం సిద్ధంగా ఉన్న రెండు పోలీసు వాహనాల్లో ఎక్కించారు. కొందరి